సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం ❘ 11 ❘ నవంబర్ ❘ 2024



పత్తి రైతు చిత్తు
పత్తి రైతు పరిస్థితి దయనీయంగా మారింది. దిగుబడి రాక, ధర లేక నష్టాలను మూటగట్టుకోక తప్పటం లేదు. 8లో



నృత్య పోటీల కోలాహలం
పాల్వంచంలోని సీతారామ కల్యాణ మండపంలో ఆదివారం భద్రశైల నృత్య పోటీలు ఘనంగా నిర్వహించారు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 20°

వాతావరణం
జిల్లాలో సోమవారం రోజంతా సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయాన్ని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

ప్రశాంతంగా ల్యాబ్ టెక్నీషియన్ పరీక్ష


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న నిర్వాహకులు

సుజాతనగర్: మండల పరిధిలోని వేపలగడ్డ అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో టీసీఎస్ నిర్వహించిన ల్యాబ్ టెక్నీషియన్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 130మంది అభ్యర్థులకు గాను 127 మంది హాజరయ్యారు. ముగ్గురు అభ్యర్థులు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు.

దివ్యాంగ ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి


సభను జయప్రదం చేయాలని కోరుతున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): హైదరాబాద్‌లో ఈ నెల 24న జరిగే దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాళోత్ జగ్గుదాస్ కోరారు. ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన సదరం క్యాంపుల్లో అర్హతలేని వారు సదరన్ సర్టిఫికెట్లు పొందారని ఆరోపించారు. అలాంటి వారు అన్ని ప్రభుత్వ పథకాలలో లబ్ధి పొందడంతో దివ్యాంగులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సదరన్ సర్టిఫికెట్ల ప్రక్షాళన, ఫిజికల్ వెరిఫికేషన్ జరగాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శులు బానోత్ శంకర్, కళాబాబు, మహిళా కార్యదర్శి అజ్మీరా ధనలక్ష్మి, ఉపాధ్యక్షులు రమణయ్య, లీగల్ అడ్వైజర్ ప్రవీణ్‌కుమార్, ఖాదర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌తో రామవరం పాఠశాల పదో తరగతి విద్యార్థులు



నూరుశాతం సాధించేలా..

పదో తరగతి ఫలితాలపై విద్యాశాఖ దృష్టి
- డిప్యూటేషన్లు, కొత్తవారి రాకతో తీరిన ఉపాధ్యాయుల కొరత
- విద్యార్థులకు నేటి నుంచి ప్రత్యేక తరగతులు
- కలెక్టర్ చొరవ చూపి స్నాక్స్ అందించాలని విన్నపం

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా జిల్లా విద్యాధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతేడాది ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈ ఏడాదైనా మెరుగైన ఫలితాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. గతేడాది సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరతతో ఫలితాల్లో వెనకబడ్డారు. ఈ సారి విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అవసరం ఉన్న చోటకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపారు. డీఎస్సీ ద్వారా నూతనంగా 421 మంది ఉపాధ్యాయులు జిల్లాలో విధుల్లో చేరారు. దీంతో ఉపాధ్యాయుల కొరత తీరగా, ఫలితాలపై అంచనాలు పెరిగాయి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి స్పెషల్ క్లాసులు ప్రారంభంకానున్నాయి. అయితే కొందరు హెచ్‌ఎంలు చొరవ తీసుకుని ఈ నెల నవంబర్ 1 నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కొత్తగూడెం ఎంఈఓ, రామవరం పాఠశాల హెచ్‌ఎం ప్రభుదయాళ్ తదితరులు సొంత ఖర్చులతో విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు.

స్పెషల్ క్లాసుల షెడ్యూల్ ఇలా...
పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఉదయం సోషల్, తెలుగు, బయాలజీ, ఇంగ్లిష్, లెక్కలు, ఫిజిక్స్, సాయంత్రం తెలుగు, హిందీ, ఇంగ్లిష్, లెక్కలు, ఫిజిక్స్, సోషల్ సబ్జెక్టులపై స్పెషల్ క్లాసులు ఉండనున్నాయి. రెండు సెషన్లలో కూడా విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మునుపటి పాఠాలను పునరావృతం చేయడంతోపాటు చర్చలు కూడా జరపాలని విద్యాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి విద్యార్థిపై క్రియాశీల పరిశీలన ఉండాలని, రోజూ హోం వర్క్ తప్పనిసరిగా ఇవ్వాలని, స్పెషల్ క్లాసులో మాత్రమే విద్యార్థుల హాజరు నమోదు చేయాలని సూచించారు. క్లాసులు ఉన్న ఉపాధ్యాయులు ఆ రోజు సీఎల్ పెట్టేందుకు వీలులేదని, హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, జనవరి 10వ తేదీలోగా సిలబస్‌ను పూర్తి చేయాలని విద్యాధికారులు ఆదేశించారు.

ఈసారీ స్నాక్స్ లేనట్టేనా..?
ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించాలనే ఉద్దేశంతో స్పెషల్ క్లాసులను ప్రారంభిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 504 మంది, రెసిడెన్షియల్ 61, కేజీబీవీ 526, సొసైటీ పాఠశాలలు 1151, ఆశ్రమ పాఠశాలలు 1995, ఎంపీపీ, జెడ్పీ పాఠశాలలు 3,325, ప్రైవేటు ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ 4101, బీసీ వెల్ఫేర్– 593, మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలల్లో 228 మంది మొత్తం 12,484 మంది ఉన్నారు. స్పెషల్ క్లాసులకు ఉదయం 8 గంటలకే రావాల్సి ఉంటుంది. సాయంత్రం వేళ కూడా పాఠశాల సమయం తర్వాత గంటపాటు ఉండాల్సి వస్తుంది. ఉదయాన్నే విద్యార్థులు ఏమి తినే అవకాశం ఉండదు. సాయంత్రం వేళలో కూడా అలసిపోయి ఉంటారు. ఈ నేపథ్యంలో గతంలో స్పెషల్ క్లాసులకు హాజరయ్యేవారికి స్నాక్స్ అందజేసేవారు. కానీ మూడేళ్లుగా స్పెషల్ క్లాసుల్లో విద్యార్థులకు స్నాక్స్ అందించడం లేదు. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వడం లేదు. కొన్ని పాఠశాలల హెచ్‌ఎంలు మాత్రం చొరవ చూపి స్పాన్సర్స్ సహకారంతో స్నాక్స్ ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి విద్యార్థులందరికీ స్నాక్స్ అందించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేటి నుంచి స్పెషల్ క్లాసులు



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి స్పెషల్ క్లాసులు ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక తరగతులకు విద్యార్థులందరూ హాజరుకావాలి. స్పెషల్ క్లాసు కేటాయించిన రోజు ఉపాధ్యాయులు లీవ్ తీసుకోవడానికి వీలు లేదు. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి, మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలి.
– వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాధికారి


భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయం

రామాలయంలో ‘కార్తీక’ సందడి

వైభవంగా రామయ్యకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం కార్తీక మాసం సందడి నెలకొంది. వారాంతపు సెలవు దినాలు, కార్తీక మాసం కలిసి రావడంతో ఆలయానికి భక్తుల రాక పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను గోదావరి మాతకు సమర్పించారు. అనంతరం రామాలయంలో స్వామివారి దర్శనానికి బారులుదీరారు. క్యూలైన్ల ద్వారా అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కాగా కార్తీక మాసం కావడంతో రామాలయానికి అనుబంధంగా ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు సైతం పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

చిత్రకూట మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు
కార్తీక మాసం సందర్భంగా చిత్రకూట మండపంలో దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామివ్రతాలు జరిగాయి. మూలమూర్తులకు ఆదివారం పురస్కరించుకుని అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి చిత్రకూట మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

‘ఆయిల్‌పామ్’ రవాణా చార్జీలు పెంపు

- టన్ను గెలలకు రూ.370 నుంచి రూ.560 పెంచుతూ ఆదేశాలు జారీ
- అశ్వారావుపేట నుంచి అప్పారావుపేట తరలించే గెలలకే వర్తింపు


ట్రాక్టర్లలో తరలిస్తున్న ఆయిల్ పామ్ గెలలు(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ గెలల రవాణా చార్జీలను పెంచుతూ తాజాగా ఆయిల్‌ఫెడ్ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఏటా వార్షిక, గెలల దిగుమతి తగ్గిన సమయంతోపాటు ఇతర కారణాలతో అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని తాత్కాలికంగా నిలిపి వేస్తుంటారు. ఆయా సమయంలో అశ్వారావుపేట మండలంలోని పామాయిల్ సాగుదారులంతా దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీకి గెలలను తరలించాల్సి వస్తోంది. దీంతో ఆయిల్‌ఫెడ్ టన్ను గెలలకు రవాణా చార్జీ రూ.370 చెల్లిస్తోంది. కానీ అశ్వారావుపేట నుంచి అప్పారావుపేట ఫ్యాక్టరీకి గెలలు తరలించేందుకు వాహనదారులు అధికంగా కిరాయి వసూలు చేస్తున్నారు. దీంతో సన్న, చిన్నకారు రైతులపై ఆర్థిక భారం పడుతోంది. ఈ క్రమంలోనే రవాణా చార్జీలను పెంచాలని రైతులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి చొరవతో ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఫలితంగా రూ. 190 పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి టన్ను గెలల తరలింపునకు రూ.560 చొప్పున చెల్లించనున్నారు. కాగా దాదాపు ఇరవై వేల ఎకరాలకు సంబంధించిన రైతులకు ప్రయోజనం జరగనుందని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి ‘సాక్షి’కి తెలిపారు.

పంచారామాలకు బస్సు సర్వీసు ప్రారంభం

చుంచుపల్లి: కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలైన పంచారామాలకు కొత్తగూడెం డిపో నుంచి బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఆదివారం కొత్తగూడెం నుంచి డిపో మేనేజర్ ఎం.దేవేందర్ గౌడ్ బస్సును ప్రారంభించి మాట్లాడారు. పంచారామాల దర్శనం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాల్వంచ, కొత్తగూడెం బస్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు.


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం

ముమ్మరంగా ‘స్థానిక’ ఏర్పాట్లు

- జిల్లాకు చేరుకుంటున్న ఎన్నికల సామగ్రి
- అన్నీ అనుకూలిస్తే వచ్చే జనవరిలో పల్లె పోరు
- జిల్లావ్యాప్తంగా 6,23,947 మంది గ్రామీణ ఓటర్లు


డీపీఓ కార్యాలయంలో నిల్వ చేసిన ఎన్నికల మాడ్యుల్స్, ప్రిసైడింగ్ కరదీపికలు

చుంచుపల్లి: షెడ్యూల్ ఎప్పుడొచ్చినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లాలో ఏర్పాట్లు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. ఎన్నికల సామగ్రి జిల్లాకు చేరుకుంటోంది. గ్రామపంచాయతీ పాలక వర్గం, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగిసి నెలలు గడుస్తుండగా, ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. జిల్లాలో కావాల్సిన బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ కేంద్రాలను సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు మరమ్మతులు చేపట్టి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల శిక్షణకు సంబంధించిన మాడ్యుల్స్, ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులకు అందజేసే కరదీపికలు జిల్లాకు చేరాయి. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల సామగ్రి కూడా 80 శాతం వరకు జిల్లాకు చేరుకోగా, బ్యాలెట్ పత్రాలు రావాల్సి ఉంది. పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు తాగునీరు, ప్రహరీ, విద్యుత్, ఫ్యాన్లు, ర్యాంపులు వంటి సౌకర్యాలపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే, కులగణనకు రెండు నెలల సమయం పట్టనుంది. ఆ తర్వాతనే స్థానిక సంస్థల రిజర్వేషన్లపై స్పష్టత రానుంది. ఈ నేపథ్యంలో అన్నీ అనుకూలిస్తే వచ్చే జనవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

2,046 బ్యాలెట్ బాక్సులు..
జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు, 4,232 వార్డులు, 21 జెడ్పీటీసీ, 220 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. తాజాగా ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం 6,23,947 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,04,264 మంది, మహిళలు 3,19,660 మంది కాగా, ఇక ఇతరులు మరో 23 మంది ఉన్నారు. 2019లో భద్రాచలం, సారపాక గ్రామ పంచాయతీలతోపాటు బూర్గంపాడులోని మండల పరిషత్ పాలక వర్గానికి ఎన్నికలు నిర్వహించలేదు. కాగా ఎన్నికల నిమిత్తం 2,046 బ్యాలెట్ బాక్సులను అధికారులు తెప్పించి ఉంచారు. జిల్లాకు చేరిన ఎన్నికల సిబ్బంది శిక్షణకు అవసరమైన పుస్తకాలు, సామగ్రి, కరదీపికలను డీపీఓ, జిల్లా పరిషత్‌తో పాటు ఆర్డీఓ కార్యాలయాల్లో నిఘా నీడలో భద్రపరిచారు. రాజకీయంగా ఎదిగేందుకు స్థానిక సంస్థల పదవులు తొలిమెట్టుగా భావించే పలువురు బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్న తెలుస్తోంది. ఆశావాహుల్లో అప్పుడే ఉత్సాహం మొదలైంది. గతంలో బీఆర్‌ఎస్‌లో కొనసాగిన స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు ఇటీవల భారీ సంఖ్యలో అధికార పార్టీలో చేరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీల పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే



ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు ఎప్పుడు షెడ్యూల్ విడుదల చేసినా నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాకు ఎన్నికల సామగ్రి చేరుకోగా నిఘా నీడలో భద్రపరిచాం. స్థానిక ఎన్నికలకు కావాల్సిన 2,046 బ్యాలెట్ బాక్సులతోపాటు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశాం.
– చంద్రమౌళి, జిల్లా పంచాయతీ అధికారి


కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


కిన్నెరసానిని వీక్షించేందుకు వచ్చిన డార్జిలింగ్‌వాసులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు పశ్చిమబెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ నుంచి కూడా సందర్శకులు తరలివచ్చారు. డ్యామ్ సమీపంలో నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 561 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా, వైల్డ్‌లైఫ్ శాఖ రూ.19,400 ఆదాయం లభించింది. 400 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.20,700 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రిజిస్ట్రేషన్ పాట్లు

- పాల్వంచలో 999, 817, 444, 727, 405 సర్వే నంబర్లలో బ్రేక్
- కొత్తగూడెంలో సర్వే నంబర్ 76లో పట్టాల కోసం ఎదురుచూపులు
- అసైన్‌మెంట్ పేరుతో దశాబ్దకాలంగా నిలిపిన అధికారులు
- రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ఆదాయం కోల్పోతున్న ప్రభుత్వం


పాల్వంచలో రిజిస్ట్రేషన్లులేని 817 సర్వే నంబర్ ఏరియా

పాల్వంచ: పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో రిజిస్ట్రేషన్ల సమస్య అభివృద్ధికి ఆటంకంగా మారింది. దశాబ్దకాలంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో భూ క్రయ, విక్రయాలు అరకొరగా సాగుతున్నాయి. పాల్వంచ మున్సిపాలిటీలో సగం సర్వే నంబర్లకు రిజిస్ట్రేషన్లు లేవు. అసైన్‌మెంట్ భూముల పేరుతో 2016 సంవత్సరం నుంచి 817, 999, 444, 727, 405 సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. ఇక కొత్తగూడెంలోని సర్వే నంబర్ 76 సైతం సింగరేణి పరిధిలో ఉండటంతో క్రమబద్ధీకరణ పట్టాలను గతంలో ఇచ్చారు. అందులో ఇంకా వందలాది మందికి పట్టాల పంపిణీ పెండింగ్‌లో ఉంది. ఎన్నికల కారణంగా గతంలో ఆగాయి. దీంతో పట్టాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూపులు చూస్తున్నారు. రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ప్రభుత్వ బ్యాంక్‌లు రుణాలు ఇవ్వడంలేదు. ప్రైవేటు బ్యాంక్‌ల రుణాలు తీసుకుంటున్నారు. దీనికితోడు ప్రభుత్వం కూడా ఆదాయం కోల్పోతోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఈ సమస్యను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

యజమానులకు ఎన్నో ఇబ్బందులు
పారిశ్రామిక ప్రాంతమైనా చాలావరకు భూభాగం ఏజెన్సీతో ముడిపడి ఉంది. సింగరేణి, కేటీపీఎస్, నవభారత్ వంటి కర్మాగారాలు ఉండటంతో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. ఈ కార్మాగారాల భూములతోపాటు, ఎండోమెంట్, అటవీ భూములు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఏజెన్సీ యాక్ట్‌లు ఉన్నాయని, అక్రమ నిర్మాణాలు చేస్తున్నారనే విమర్శలు వస్తుంటాయి. ఇక అధికా రుల నుంచి సరైన అనుమతులు కూడా రావు. ఫిర్యాదులు, బెదిరింపులు, అధికారుల నోటీసుల జారీ వంటి పరిస్థితులను ఎదుర్కొంటూ భూ యజమానులు నిర్మాణాలు చేపట్టాల్సి వస్తోంది. అధికారులకు, అడ్డుకునే వారికి, ఇతర సంఘాలకు ముడుపులు ముట్టజెప్పడం నిత్యకృత్యంగా మారింది.

సీఎం దృష్టికి తీసుకెళ్లా..



పాల్వంచలోని 817, 999, 727, 405, 444, కొత్తగూడెంలో 76 సర్వే నంబర్ల సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాను. వారు కూడా సానుకూలంగా ఉన్నారు. సాధ్యమైనంత త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది.
–కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే, కొత్తగూడెం

2016 నుంచి నిలిపోయిన రిజిస్ట్రేషన్లు
పాల్వంచంలో సర్వే నంబర్ 999లో పేట చెరువు, పిల్లవాగు, కొత్తూరు, బంగారుజాల, 817లో శివనగర్, నెహ్రూనగర్, గాంధీనగర్, కాంట్రాక్టర్స్ కాలనీ, వెంకటేశ్వర హిల్స్ కాలనీ, జయమ్మ కాలనీ, వికలాంగుల కాలనీ, ఇందిరా కాలనీ, 444లో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రాంతం, నవభారత్ ఏరియా, 405లో నవభారత్, కేఎస్‌ఎం ఏరియా, 727 సర్వే నంబర్‌లో ప్రశాంత్ కాలనీ, వెంగళరావు కాలనీ ఉన్నాయి. ఈ ఏరియాల్లో గతంలో అభివృద్ధి వేగవంతం కాగా, పెద్ద పెద్ద భవన నిర్మాణాలు జరిగాయి. ఆయా ప్రాంతాల్లో అసైన్‌మెంట్ భూమి ఉందనే కారణంతో 2016 సంవత్సరంలో ఒక్కసారిగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిపివేశారు. దీంతో భవన నిర్మాణాలు సాగకపోవడంతో అభివృద్ధి మందగించింది. పెళ్లిళ్లు, ఆస్పత్రి అవసరాలు తదితర అత్యవసర పరిస్థితుల్లో ప్లాట్లు, ఇళ్లు విక్రయించుకోవాలంటే రిజిస్ట్రేషన్ల సమస్య ఎదురవుతోంది. అయితే గతంలో రిజిస్ట్రేషన్లు, ఇతర అనుమతులను పునరుద్ధరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విచారణ సజావుగా సాగేనా..?

- ములకలపల్లి సొసైటీలో టూవీలర్ల రుణాల్లో అక్రమాలు
- డీసీసీబీ బ్రాంచ్‌లో నేడు తుది విచారణ

అశ్వారావుపేట: ములకలపల్లి పీఏసీఎస్‌లో టూవీలర్ల రుణాల మంజూరులో జరిగిన అవకతవకలు వెలుగుచూడగా, బాధ్యులైన ఇద్దరు ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. రూ. 9,54,047 నిధులు దుర్వినియోగం చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ములకలపల్లి డీసీసీబీ మేనేజర్‌గా గతంలో పనిచేసిన ఈ.శాంతి రాగమయి, క్యాషియర్ ఎస్.పూర్ణచంద్రరావులపై క్రమశిక్షణా చర్యలకు విచారణాధికారులు సిఫారసు చేశారు. 2020లో రెండు టూవీలర్లకు డీసీసీబీ మంజూరు చేసిన రుణాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, అప్పటి మేనేజర్, క్యాషియర్లు వారి సొంతానికి టూవీలర్లను వినియోగించుకున్నారని విచారణలో తేలింది. కాగా ములకలపల్లి డీసీసీబీలో నేడు తుది విచారణ నిర్వహించనున్నారు. కాగా అదే శాఖ అధికారులే విచారణ నిర్వహించనుండగా, విచారణ సజావుగా జరిగేనా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ శాఖ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు. ఉద్యోగులే రుణాలను సొంతానికి వాడుకుంటే పాలకవర్గం ఏమాత్రం చేతివాటం ప్రదర్శించిందోననే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. డీసీసీబీ పరిధిలోని రుణాలన్నింటిపై థర్డ్ పార్టీ విచారణ నిర్వహించాలని కోరుతున్నారు.

పత్తి రైతు చిత్తు

పత్తి రైతు పరిస్థితి దయనీయంగా మారింది. దిగుబడి రాక, ధర లేక పత్తి సాగు రైతులు నష్టాలను మూటగట్టుకోక తప్పటం లేదు. ఈ ఏడాది సీజన్ ఆరంభం నుంచి సమృద్ధిగా వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలో 1.99 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. పంట సీజన్ ఆరంభంలో వానలు అనుకూలించటంతో రైతులు దిగుబడిపై గంపెడాశలు పెట్టుకున్నారు. పైరు పూత, కాత దశలో వర్షాల ప్రభావం పెరిగింది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో భారీ వర్షాలు, వరదలు వచ్చాయి. ఈ వర్షాలు పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపాయి. పత్తి నేలలు ఊటలెత్తాయి. దీంతో పూత, కాత బాగా దెబ్బతిన్నది. పైర్లు తేమ బారీన పడి ఎర్రబారాయి. ఈ ప్రభావం పంట దిగుబడులపై బాగా చూపింది. ఇక పల్లపు ప్రాంతాల్లో పంట అధిక తేమకు గురై బాగా దెబ్బతిన్నది. ఓ వైపు పంట దిగుబడులు బాగా తగ్గిపోగా.. మరోవైపు కనీస మద్దతు ధర దక్కని పరిస్థితి నెలకొంది. కనీసం పెట్టుబడులు రాని దయనీయ స్థితిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– ఖమ్మంవ్యవసాయం

దిగుబడి రాక, ధర లేక..

- నష్టాలను మూట గట్టుకుంటున్న రైతన్న
- ఎకరాకు రూ.15 వేలకు పైగా నష్టం
- కౌలు రైతుకు రూ.30 వేలకు పైగా నష్టం



ఖమ్మం మార్కెట్‌లో విక్రయానికి తీసుకొచ్చిన పత్తి

5 క్వింటాళ్లకు మించని దిగుబడి

ప్రస్తుత సీజన్‌లో పత్తి దిగుబడులు కనీసం 5 క్వింటాళ్లకు మించని పరిస్థితి నెలకొంది. వర్షాధారంగా సాగు చేసిన పత్తి ఎకరాకు నేల రకాన్ని బట్టి 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయి. నీటివనరులు ఉన్న భూముల్లో ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు కూడా దిగుబడులు వస్తాయి. అలాంటిది ఈ ఏడాది అధిక వర్షాలు, తేమ ప్రభావంతో 4 నుంచి 5 క్వింటాళ్లకు మించి దిగుబడులు రావటం లేదు.

కనీస మద్దతు ధర దక్కని దుస్థితి

సాధారణంగా ప్రతి వస్తువు లేదా పంట ఉత్పత్తి తక్కువగా ఉంటే ఆ వస్తువు లేదా పంటకు డిమాండ్ ఉంటుంది. కానీ, ఇక్కడ అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. పత్తి దిగుబడులు తక్కువగా ఉన్నా ధర లేని పరిస్థితి నెలకొంది. కనీసం ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా రైతులకు దక్కని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పత్తికి కనీస మద్దతు ధర రూ.7,521గా నిర్ణయించింది. కనీసం ఆ ధర కూడా రైతులకు దక్కని పరిస్థితి నెలకొంది. వ్యాపారులు పంట నాణ్యంగా ఉన్నా రూ.6,500కు మించి ధర పెట్టడం లేదు. ప్రభుత్వం పత్తి కొనుగోళ్లకు సీసీఐ సంస్థను రంగంలోకి దింపినప్పటికీ రైతులకు ప్రయోజనం కలగడం లేదు. జిన్నింగ్ మిల్లుల ద్వారా సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తోంది. ఈ ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాల పేరిట రైతుల పంటను నిరాకరిస్తుండగా, దళారులు బినామీ రైతుల పేరిట విక్రయానికి తీసుకొచ్చే పంటను కొనుగోలు చేసి వారికి ప్రయోజనం కలిగిస్తున్నారు. ఆ ఇబ్బందులు పడలేని రైతులు తిరిగి పంటను తక్కువ ధరలకు వ్యాపారులకు విక్రయించుకోక తప్పటం లేదు. నాణ్యంగా లేని పంటకు రూ.5,500కు మించి వ్యాపారులు ధర పెట్టడం లేదు.

ఎకరాకు రూ.15 వేలకు పైగా నష్టం

ఈ ఏడాది పత్తి సాగుతో సొంత భూమి కలిగిన రైతులు ఎకరాకు రూ.15 నుంచి రూ.20 వేల వరకు నష్టపోతున్నారు. ఎకరా పత్తి సాగు నుంచి విక్రయించే వరకు పెట్టుబడి రూ.43 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చు వస్తోంది. దిగుబడి 4 నుంచి 5 క్వింటాళ్లకు మించి రావటం లేదు. క్వింటా ధర సగటున రూ.6 వేలు కాగా 5 క్వింటాళ్ల పత్తికి రూ.30 వేలు వస్తాయి. నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ.24 వేలకు మించి ఆదాయం రాదు. ఈ లెక్కన పెట్టుబడులు, ఆదాయాన్ని పరిశీలిస్తే ఎకరాకు రూ.15 నుంచి రూ.20 వేల వరకు నష్టం వాటిల్లుతోంది.

పత్తి సాగు పెట్టుబడి వ్యయం (ఎకరాకు రూ.ల్లో)

విత్తనాలు 4 ప్యాకెట్లు	3,280
(ఒక్కో ప్యాకెట్ రూ.820)	
దుక్కి దున్నే ఖర్చులు	6,000
విత్తనం పెట్టే కూలీలు (ముగ్గురికి)	1,200
4 ఎరువుల బస్తాలు	4,800
కలుపు తీసిన కూలీలకు	5,000
4 సార్లు పాటు	8,000
పై మందులు	6,000
పత్తితీత ఖర్చు	7,200
బస్తాలు, రవాణా	1,500
మొత్తం	42,980



అధిక వర్షాలకు తేమబారిన పడి దెబ్బతిన్న పత్తి పైరు

కౌలు రైతుకు మరో రూ.15వేలు నష్టం

కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. సొంత భూమి ఉన్న రైతే పత్తి సాగు చేసి నష్టపోతుండగా, కౌలు రైతులు రెట్టింపు నష్టపోతున్నారు. ప్రస్తుతం కౌళ్లు ప్రాంతాన్ని బట్టి ఎకరాకు రూ.15 నుంచి రూ.20 వేల వరకు పలుకుతున్నాయి. దీంతో ఎకరాకు సాధారణ నష్టం రూ.15 నుంచి రూ.20 వేల వరకు నష్టం జరుగుతుండగా, కౌలు నష్టం మరో రూ.15 నుంచి రూ.20 వేల వరకు నష్టం వాటిల్లుతోంది. మొత్తంగా కౌలు రైతుకు ఎకరాకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు నష్టం కలుగుతోంది.

పత్తి సాగు నిండా ముంచింది



పత్తి సాగు నిండా ముంచింది. 2 ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఆరుగాలం ఇంటిల్లిపాది చేలోనే పనిచేశాం. 18 బస్తాల దిగుబడి వచ్చింది. 8 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. పంట ఎంతో నాణ్యంగా ఉంది. వ్యాపారి పెట్టుబడి పెట్టడంతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి తీసుకువచ్చా. క్వింటాకు రూ.6,500 ధర పెట్టారు.

–గుగులోత్ రవి, ఉప్పలచెలక, ఖమ్మం జిల్లా

దళారులకు ఆంక్షలు లేవు..



అధిక వర్షాలు బాగా దెబ్బతీశాయి. సీసీఐ కేంద్రాలు ప్రయోజనం కలిగించటం లేదు. రైతులు నేరుగా పత్తి విక్రయానికి తీసుకెళ్తే కొర్రీలు పెడుతున్నారు. దళారులు పంట తీసుకెళ్తే ఆంక్షలు ఉండటం లేదు. దళారులు సగటున రూ.6 వేలకు కొనుగోలు చేసి జిన్నింగ్ మిల్లుల్లో రూ.7,521కు విక్రయిస్తున్నారు. ఇలా పత్తి సాగు చేసిన రైతులు నష్టపోతున్నారు.

–గడ్డికొట్టు శ్యాంసుందర్‌రెడ్డి, మోతె, సూర్యాపేట జిల్లా

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మధిర: కృష్ణాపురంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రసాయి రగ్బీ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. 10వ తరగతి, 8వ తరగతి విద్యార్థులు ఎస్.ఉత్తేజ్, వి.భార్గవ్, సీహెచ్ గణేశ్, జి.శ్రీహర్ష అండర్–14, అండర్–17 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నరసింహారావు ఆదివారం తెలిపారు. మేడ్చల్ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనుండగా.. పాఠశాల ప్రిన్సిపాల్ రేగండ్ల శ్రావణి, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్ విద్యార్థులను అభినందించారు.

రగ్బీ క్రీడలో...



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రగ్బీ అండర్–17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సంజీవరావు తెలిపారు. వీరు మేడ్చల్‌లో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కాగా, విద్యార్థులను ఆదివారం హెచ్‌ఎంతోపాటు ఏటీపీ లివిన్, పీఈటీ కృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రేపటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పోటీలు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఈ నెల 12 నుంచి 15 వరకు తెలుగు రాష్ట్రాలస్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ ఎర్రబోయిన నర్సయ్య ఆదివారం తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఏపీ, తెలంగాణ స్థాయిలో ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశామని, 12న రెండు పళ్ల విభాగం, 13న నాలుగు పళ్ల విభాగం, 14న ఆరు పళ్ల విభాగం, 15న న్యూ కేటగిరీ విభాగానికి సంబంధించిన పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు 97057 90425 (దండా వెంకటేశ్వర్లు), 98669 25698 (దండా రంగయ్య), 88868 40946 (ఆర్.నవీన్), 87121 69967 (సుధీర్), 99899 59181 (కె.ఉపేందర్) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

ఘనంగా గౌడ సంఘం వనసమారాధన



ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పెనుబల్లి: మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెనుబల్లిలో సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్‌విజయ్‌కుమార్, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దంపతులు ఆవిష్కరించారు. అనంతరం గౌడ వన సమారాధనలో పాల్గొని మాట్లాడారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పంది వెంకటేశ్వరరావును ప్రకటించారు. సర్వాయ్ పాపన్నగౌడ్ చరిత్ర ఛత్రపతి శివాజీతో సమానమైనదని, కానీ ఆయన చరిత్ర మరుగున పడిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఈవీ రమేశ్, కందిమళ్ల కృష్ణారావు, చింతలపాటి వెంకటేశ్వరరావు, నాయుడు మల్లయ్యస్వామి, బొర్రా కోటేశ్వరరావు, పొట్లపల్లి వెంటేశ్వరరావు, వేముల రవికుమార్, బొర్రా వెంకటేశ్వర్లు, కుక్కా శ్రీనివాస్‌గౌడ్, వంగా దామోదర్, దొంతు మాధవరావు, ఈడా కమలాకర్‌రావు, నరసింహారావు, ప్రసాద్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి దంపతులు

ముగిసిన రాష్ట్రస్థాయి ఖో–ఖో పోటీలు



నిజామాబాద్ జిల్లా జట్టు

ప్రథమ స్థానంలో నిజామాబాద్ జిల్లా

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి 68వ 17 ఏళ్ల విభాగం బాలికల ఖో–ఖో పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీల్లో నిజామాబాద్ జిల్లా ప్రథమ, నల్లగొండ ద్వితీయస్థానం, ఖమ్మం తృతీయస్థానం, రంగారెడ్డి నాలుగోస్థానంలో నిలిచాయి. ఖమ్మం జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిశీలకులు ఎస్.శివరామ్, హెచ్‌ఎం శ్రీహరి, శ్రీనిధి కరస్పాండెంట్ అంజన్‌బాబు, ఎస్‌కే ముస్తఫా, భద్రాద్రి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పామర్తి శ్రీనివాసరావు, కృష్ణ, ఎస్.రామారావు, ఎస్.ప్రసాద్, ఖమ్మం జిల్లా టీమ్ ఇన్‌చార్జ్ గుంటుపల్లి రమాదేవి, మేనేజర్ సీహెచ్ శ్రీదేవి, కె.పద్మావతి, వి.కృష్ణారావు, పుణ్యపుర్తి నరసయ్య, ఎస్‌కే రంజాన్, ఎన్.వెంకటేశ్వర్లు, సైదులు, రాము, ఖమ్మం జిల్లా ఖో–ఖో టీమ్ కోచ్ ఎస్.దుర్గారెడ్డి, టోర్నమెంట్ ప్రచార కార్యదర్శులు బి.భీమా, పసుపులేటి వీరరాఘవయ్య పాల్గొన్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

కొత్తగూడెంఅర్బన్: భార్యపై భర్త రాళ్లతో దాడి చేసి హత్యయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణ పరిధి సింగరేణి మెయిన్ ఆస్పత్రి ఏరియాకు చెందిన యాకుబ్‌పాషా, ఆసిఫా దంపతుల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండటంతో ఆమె రెండేళ్లుగా హనుమాన్‌బస్తీలోని తల్లి ఇంట్లోనే ఉంటోంది. యాకుబ్‌పాషా ఆదివారం రాత్రి ఆసిఫా ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఆసిఫాపై రాళ్లతో దాడి చేశాడు. బాధితురాలిని కుటుంబ సభ్యులు కొత్తగూడెం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని త్రీటౌన్ పోలీసులు పరిశీలించారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తికి గాయాలు

కారేపల్లి: ట్రాక్టర్ పైనుంచి పత్తి బస్తాలు దింపుతుండగా.. అదుపుతప్పి కిందపడటంతో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలోని వెంకిట్యాతండాలో ఆదివారం చోటుచేసుకుంది. తండాకు చెందిన రైతు బానోత్ మంగ్యా తన పత్తి చేనులో పత్తి తీయించి బస్తాలను ట్రాక్టర్‌పై వేసుకొని ఇంటికి తీసుకొచ్చాడు. అనంతరం పత్తి బస్తాలను ట్రాక్టర్ పైకి ఎక్కి కిందికి దించుతున్న క్రమంలో జారి సీసీరోడ్డుపై పడ్డాడు. గాయపడిన మంగ్యాను కారేపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి



తోట వెంకటేశ్వరరావు మృతదేహం

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి మరో ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు (32) అప్పారావుపేటలోని తన సోదరి వద్ద ఉంటూ పామాయిల్ ఫ్యాక్టరీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం ఫ్యాక్టరీలో ఫైబర్ డ్రాపింగ్ పాయింట్ వద్ద ట్రాక్టర్ డ్రైవింగ్ చేయడానికి వెళ్లాడు. రాత్రి వరకు పనిచేసిన అనంతరం అదే డ్రాపింగ్ పాయింట్ వద్ద ఎలాంటి భద్రత లేకుండా నిద్రించాడు. రాత్రి అదే పాయింట్ వద్ద గొంది మురళీకృష్ణ ట్రాక్టర్ నడుపుతున్నాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మురళీకృష్ణ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ వెంకటేశ్వరరావు పొట్టి కడుపు పైనుంచి పోనిచ్చాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్య సిబ్బంది వెంకటేశ్వరరావు మృతి చెందాడని తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు. కాగా, ట్రాక్టర్ డ్రైవర్ మృతిపై కనీసం పోలీసులకు కూడా సమాచారం ఇవ్వకుండా.. గుట్టు చప్పుడు కాకుండా మృతదేహాన్ని రాత్రికి రాత్రే మృతుడి సొంత ఊరు అంకంపాలెంకు తరలించేలా చేసిన లేబర్ కాంట్రాక్టు బాధ్యుల తీరుపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల భద్రత, పని గంటల సమయాల్లో ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'ఇంజనీర్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్స్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటరామిరెడ్డి



వైరా/గాంధీచౌక్ : ఇంజనీర్స్, వర్క్‌ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వైరాకు చెందిన బొగ్గుల రామిరెడ్డిని హైదరాబాద్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రామిరెడ్డి 1984లో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరి 2009లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారు.

ఆలయంలో ఘంట చోరీ

పాల్వంచ: ఒడ్డుగూడెం ఏరియాలోని ముత్యాలమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఘంటను చోరీ చేశారు. స్థానికుల కథనం మేరకు.. ముత్యాలమ్మ ఆలయంలోకి ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి పెద్ద ఘంటను చోరీ చేశారు. హుండీని పగులగొట్టేందుకు గుడిలోని ఇనుప పైపులు పట్టుకెళ్లేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు.ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కి ఫోన్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వరి కోతల్లో జాగ్రత్తలు పాటించాలి..

- మెళకువలు పాటిస్తే నాణ్యమైన ధాన్యం
- హార్వెస్టర్లకు పెరిగిన డిమాండ్..



వరి పంటను నూర్పిడి చేస్తున్న యంత్రం

కరకగూడెం: పండించిన పంటను సకాలంలో కోసి సరైన పద్ధతిలో నిల్వ చేయడం ద్వారా మాత్రమే రైతులు తమ కష్టానికి తగిన ఫలితం పొందుతారు. వరి కోతల సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. వరి కోతలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. పంట చేతికొచ్చిన సమయంలో కోతలు చేపట్టకపోతే రైతులు నష్టపోయే ఆస్కారం ఉంది. చేను పూర్తిగా ఎండినా, పండువారినా కోత సమయంలో గింజలు రాలుతాయి. పంట చేతికొచ్చినప్పటి నుంచి కోతలు, ధాన్యం నిల్వ చేయడం వంటి వాటిపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వరికోతల సమయంలో మెళకువలు పాటిస్తే నాణ్యమైన ధాన్యాన్ని పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

చేను పండువారిన తరువాత కోతకు 15 రోజుల ముందే నీటి తడులు నిలిపేయాలి. గెలకున్న చివరి గింజ పసు పెక్కే వరకూ పంట కోయొద్దు. ముందే కోస్తే తాలు గింజలవుతాయి. మంచు కురిసే సమయాల్లో కోస్తే గింజలు మెత్తబడి ధాన్యం నలుపెక్కుతుంది. కోతలు ఆలస్యమైనా ఎండకు గింజ పగుళ్లు వచ్చి వడ్లు నూక అవుతాయి. 80 నుంచి 90 శాతం వరి వెన్నుల పసుపు రంగుకు మారుతున్న సమయంలో పంట కోయాలి. ఆకులు పూర్తిగా ఎండిపోయే వరకు చేనును ఉంచకూడదు. ఈ దశలో వడ్లలో సాధారణంగా 1820 శాతం తేమ ఉంటుంది. తేమ శాతాన్ని తగ్గించేందుకు రెండు, మూడు రోజులు మెద ఎండపెట్టాలి. హార్వెస్టర్‌తో కోస్తే వెంటనే కల్లంలో ఆరబోయాలి. రాత్రి సమయంలో మంచు తగలకుండా కుప్పచేసి కవర్ కప్పాలి. ఒక వేళ వర్షం వస్తే 5 శాతం ఉప్పు కలిపిన నీటిని చేనుపై పిచికారీ చేయాలి. హార్వెస్టర్లలో దుమ్ము, ధూళి, మట్టి పెల్లలు ఉండకుండా చూసుకోవాలి. ధాన్యంలో తేమ 12 నుంచి 14 శాతం తగ్గే వరకు ఎండబోయాలి. ధాన్యాన్ని ఆశించే కీటకాల నుంచి రక్షణకు పరిసరాల్లో పొగబెట్టాలి.

వరి కోతల తర్వాత..

నూర్పిడి తర్వాత వరిశుభ్రంగా తూర్పార బోసి చెత్త, మట్టి వంటి వాటిని వేరు చేయాలి. తూర్పార పట్టిన ధాన్యంలో తేమ 12 నుంచి 14 శాతానికి తగ్గేలా ఆరబెట్టాలి. చవుడు నేలల్లో పండించిన ధాన్యాన్ని మంచి ధాన్యంలో కలపొద్దు. చీడపీడలు ఆశించిన, రంగు మారిన ధాన్యాన్ని మంచి ధాన్యంలో కలువకుండా జాగ్రత్త తీసుకోవాలి. ప్రస్తుతం అక్కడక్కడా మబ్బులతో కూడిన వాతావరణం ఉండి చిరుజల్లులు కురుస్తున్నందున కల్లాల్లో ఉన్న వరి ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు లేదా వరి గడ్డిని మందంగా కప్పి తడవకుండా జాగ్రత్త పడాలి.



ధాన్యాన్ని ట్రాక్టర్ ట్రాలీలోకి పోస్తున్న యంత్రం

రైతులపై భారం

రైతులందరు ఒకేసారి కోతలు మొదలు పెట్టడంతో వరి కోత యంత్రాల యజమానులు ధరలను అమాంతం పెంచేశారు. కొందరు దళారులు ఇతర రాష్ట్రాల నుంచి వరికోత యంత్రాలను తీసుకొచ్చి అధిక ధరలు వసూలు చేస్తున్నారు. గతేడాదితో పోల్చితే వరికోతల వ్యయం రెండింతలు పెరిగింది. చైన్ మిషన్ గంటకు రూ.3,200 నుంచి రూ.3,500.. ధర ఉంటోంది. అధికారులు, పాలకులు స్పందించి ధరలను నియంత్రించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ధరలను నియంత్రించాలి..



కోత మిషన్ యజమానులు రైతుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. వేరే మార్గం లేక వారు అడిగినంత ఇవ్వాల్సి వస్తోంది. ఇప్పటికే తెగుళ్లు, వర్షాలతో తీవ్రంగా నష్టపోయి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. అధికారులు ధరలను నియంత్రిస్తే మాలాంటి వారికి మేలు జరుగుతుంది.

– జిగట మల్లయ్య, మొగిలితోగు

రైతులకు అవగాహన కల్పించాలి



వరి కోతలు ప్రతి రైతుకు ముఖ్యమైన విషయం. ఈ క్రమంలో సరైన పద్ధతులను అనుసరించకపోతే పంట నష్టం జరిగే అవకాశం ఉంది. తద్వారా ఆర్థికంగా నష్టపోవాల్సి ఉంటుంది. వ్యవసాయ శాఖ అధికారులు వరి కోతలపై రైతులకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యం.

– కొడెం రామారావు, బంగారుగూడెం

సరైన పద్ధతులు అనుసరించాలి..



రైతులు సరైన కోత పద్ధతులు అనుసరించడం ద్వారా నాణ్యమైన దిగుబడి లభిస్తుంది. పంట పూర్తిగా పండితేనే కోయాలి. హార్వెస్టర్లను సరిగ్గా నిర్వహించాలి. కోసిన ధాన్యాన్ని తేమ లేని చోట నిల్వ చేయాలి. విధిగా రైతులకు కోతల జాగ్రతలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతాం.

– చటర్జీ, ఏఈ, కరకగూడెం

వ్యక్తి ఆత్మహత్య



అశోక్ (ఫైల్)

టేకులపల్లి: భార్యతో గొడవల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేశ్ కథనం మేరకు.. కోయగూడెం గ్రామానికి చెందిన పూనెం అశోక్ (38)కు.. తన భార్యకు మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపం చెందిన అశోక్ శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఆదివారం కేటీసీ మార్గంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి కన్నీరుమున్నీరయ్యారు. ఎస్‌ఐ పంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా తన కోడలు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ తన కొడుకుకు అన్యాయం చేయడంతోనే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి పూనెం లక్ష్మి ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కామెర్లతో బాలుడు...



సాయిచరణ్ (ఫైల్)

గుండాల: కొంతకాలంగా కామెర్లతో బాధపడుతున్న బాలుడు వైద్యం పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన వెలిశాల సాయిచరణ్ (13) కొంతకాలంగా జ్వరం, కామెర్లతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రికి.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూనే మృతి చెందాడు.

వరి కోత మిషన్ ఢీకొని మహిళ...



అనసూర్య (ఫైల్)

పాల్వంచరూరల్: వరికోత మిషన్ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సోములగూడెం గ్రామ శివారులోని తన పొలంలో పెద్దినేటి అనసూర్య (53) మిషన్ పెట్టి వరి పంటను కోయిస్తోంది. మోరంపల్లి బంజరకు చెందిన మిషన్ డ్రైవర్ సారయ్య నిర్లక్ష్యంగా నడపడంతో మిషన్ ఢీకొని అనసూర్య తీవ్రంగా గాయపడింది. ఆమెను కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుడు రమేశ్ ఫిర్యాదు మేరకు మిషన్ డ్రైవర్ సారయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

నేడు ఏపీ పూర్తి స్థాయి బడ్జెట్

కూటమి ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్, రెడ్‌బుక్ అరాచకాలపై జనం ప్రశ్నిస్తుండటంతో డైవర్షన్ రాజకీయాలే లక్ష్యంగా అజెండా

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజల కళ్లుగప్పటం... రాష్ట్రంలో జరుగుతున్న అఘాయిత్యాలపై ఎవరూ ప్రశ్నించకుండా రెడ్‌బుక్ అమలుతో దృష్టి మళ్లింపు రాజకీయాలే లక్ష్యంగా సాగుతున్న సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు సోమవారం శాసనసభలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. నేడు ఉదయం 9 గంటలకు అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశమై బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలపనుంది. అనంతరం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అదే సమయానికి శాసన మండలిలో గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్‌ను చదువుతారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టడం పూర్తి అయిన అనంతరం వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రవేశపెడతారు. మండలిలో మంత్రి నారాయణ వ్యవసాయ బడ్జెట్‌ను చదువుతారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా మభ్యపెడుతున్న కూటమి సర్కారు అసెంబ్లీ సమావేశాలను సైతం డైవర్షన్ రాజకీయాలకే వినియోగించుకోవాలని ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై యథేచ్ఛగా జరుగుతున్న అఘాయిత్యాలు, లైంగిక దాడులు, హత్యలు, శాంతి భద్రతల వైఫల్యం నుంచి దృష్టి మళ్లించేందుకు.. ఇప్పుడే కొత్తగా సోషల్ మీడియాలో పోస్టులు వచ్చినట్లు, వాటిపైనే చర్చించాలనే వైఖరితో ప్రభుత్వం ఉందనే అభిప్రాయాన్ని అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. పలుచోట్ల మైనర్ బాలికలు అత్యాచారాలు, హత్యలకు గురి కావడం నుంచి దృష్టి మళ్లించడమే లక్ష్యంగా సోషల్ మీడియా పోస్టులపై ప్రభుత్వ పెద్దలు ఇటీవల గగ్గోలు పెడుతున్నారు. ఇదే అంశాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించాలని సన్నద్ధమైనట్లు సమాచారం. మరోపక్క సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బడ్జెట్ సమావేశాల్లో గత సర్కారుపై ఆరోపణలు, నిందలు మోపేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేసినట్లు తెలుస్తోంది.

పోర్టులు, మెడికల్ కాలేజీలు అమ్మేస్తూ..

సీ-ప్లేన్‌తో రాష్ట్రాభివృద్ధా?

చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్





- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.13,254.05 కోట్లతో మూడు పోర్టుల నిర్మాణం
- రూ.8,480 కోట్లతో అత్యాధునిక వైద్యం, కొత్తగా 17 మెడికల్ కాలేజీలు
- ఇదంతా అభివృద్ధి కాదా? సంపద సృష్టి కాదా?
- ఈ ఆస్తులు విలువ భవిష్యత్తులో రూ.లక్షల కోట్లు కాదా?







సాక్షి, అమరావతి : 'సీ ప్లేన్ నడిపితే రాష్ట్రాభివృద్ధి జరిగిపోయినట్లా?' అని సీఎం చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. దేశంలో తొలిసారిగా సీ ప్లేన్ నడిపినట్టుగా చంద్రబాబు బిల్డప్ ఇస్తుండటం.. అందుకు ఎల్లో మీడియా డప్పు కొడుతుండటం చూస్తుంటే పిట్టల దొర డైలాగ్‌లు గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల సంపదగా నిర్మిస్తూ సృష్టించిన మెడికల్ కాలేజీలు, పోర్టులను ప్రయివేటుపరం చేస్తూ, స్కాంలు చేస్తూ తన మనుషులకు తెగనమ్ముతూ.. వీటన్నింటిపై ప్రజల్లో చర్చ జరగకూడదనే సీ ప్లేన్‌తో అభివృద్ధి జరిగిపోయినట్లు పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దుర్మార్గపు చర్యలను చివరకు ప్రజలు తప్పక నిలదీస్తారని, ఈ ప్రభుత్వాన్ని ఎండగడతారని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

1 చంద్రబాబు గురించి చెప్పాలంటే.. మాయ చేస్తాడు, మభ్యపెడతాడు, చివరకు ప్రజలను మోసం చేస్తాడు. ఇందుకోసం ఎన్ని వేషాలు వేయాలో అన్ని వేషాలూ వేస్తాడు. తాజాగా విజయవాడ నుంచి శ్రీశైలం వరకూ సీ ప్లేన్ ద్వారా చేసిన పర్యటన ఇలాంటిదే. సెల్ ఫోన్ తానే కనిపెట్టానని, కంప్యూటర్లు కూడా తానే కనిపెట్టానని రెండు దశాబ్దాలుగా కబుర్లు చెబుతున్న చంద్రబాబు, ఇప్పుడు సీ ప్లేన్ మీద కూడా కహానీలు మొదలెట్టేశారు. దేశంలోనే తొలిసారి అన్నట్టుగా, మరెక్కడా లేదన్నట్టుగా, సీ ప్లేన్ నడిపితే చాలు రాష్ట్రాభివృద్ధి జరిగిపోయినట్లుగా బిల్డప్ ఇస్తున్నారు.

2 సీ ప్లేన్ అన్నది ఇప్పటిది కాదు. దాదాపు 114 ఏళ్ల క్రితమే 1910లో నడిచింది. మన దేశంలో కేరళలో 2013లో మొదలయ్యి తర్వాత నిలిపేశారు. గుజరాత్‌లో 2020లో సర్వీసులు నడవటం మొదలుపెట్టినా అవికూడా పలుమార్లు నిలిచిపోయాయి. ప్రతి రాష్ట్రంలోనూ అనేక రిజర్వాయర్లు, డ్యాంలు ఉన్నాయి. మరి ఎందుకు ఆయా రాష్ట్రాల్లో ఇలాంటి ప్రయోగాలు కొనసాగడం లేదు?

3 ఆపరేషన్స్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాంకేతిక సమస్యలు, ప్రయాణికుల భద్రతాపరమైన అంశాలతోపాటు నిర్వహణా భారం దీనికి ప్రధాన కారణాలని అనేక మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. ఇలాంటి 14 మంది ప్రయాణికుల సీ ప్లేన్ సర్వీసులను అభివృద్ధికి ఒక ప్రమాణంగా చంద్రబాబు గొప్పగా చెప్పుకోవడం, దాన్ని ఎల్లో మీడియా కీర్తించడం.. పరస్పరం డప్పాలు కొట్టుకోవడం కాదా?

4 సంపద సృష్టించడమంటే ప్రభుత్వ రంగంలో పోర్టులు నిర్మించి, తద్వారా అభివృద్ధి చేసి.. ప్రభుత్వానికి ఆదాయం కల్పించడం. ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీలు కట్టి, ప్రజలకు అందుబాటులో ఉచితంగా నాణ్యమైన, అత్యాధునిక వైద్యాన్ని అందించడం. ఇలాంటివి కాకుండా సీ ప్లేన్ మీద పబ్లిసిటీ స్టంట్లు ఏమిటి?

5 చంద్రబాబూ.. రూ.8,480 కోట్లతో ప్రభుత్వ రంగంలో, మారుమూల ప్రాంతాల్లో అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తెస్తూ, తద్వారా మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిని తీసుకొస్తూ, కొత్తగా 17 మెడికల్ కాలేజీలు కట్టడం సంపద సృష్టి అవుతుందా? లేక వాటిని ప్రయివేటు పరం పేరుతో మీ మనుషులకు స్కామ్‌లు చేస్తూ అమ్మాలనుకోవడం సంపద సృష్టి అవుతుందా?

6 సుదీర్ఘ తీర ప్రాంతాన్ని వినియోగించుకుని మెరుగైన వాణిజ్యాన్ని, రాష్ట్రానికి అదనపు ఆదాయాన్ని, ప్రజలకు ఉపాధిని, పారిశ్రామిక ప్రగతిని సాధించడానికి ప్రభుత్వ రంగంలో రూ.4,361.91 కోట్లతో మూలపేట, రూ.5,156 కోట్లతో మచిలీపట్నం, రూ.3,736.14 కోట్లతో రామాయపట్నం వద్ద.. మొత్తంగా మూడు పోర్టులను రూ.13,254.05 కోట్లతో నిర్మిస్తే దాన్ని అభివృద్ధి, సంపద సృష్టి అంటారా? లేక సీ ప్లేన్‌లో తిరిగి ఈ పోర్టుల ఆస్తులను మీ వారికి స్కామ్‌ల ద్వారా తెగనమ్మితే దాన్ని అభివృద్ధి, సంపద సృష్టి అంటారా? ప్రభుత్వ రంగ పోర్టుల వల్ల రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందా? లేక ఈ సంపద సృష్టించే వనరులను తెగనమ్మడంతో పాటు, సీ ప్లేన్స్ వల్ల రాష్ట్రానికి సంపద పెరుగుతుందా?

7 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, పోర్టుల రూపేణా మొత్తంగా రూ.21,734 కోట్ల పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రజల ఆస్తి కాదా? ప్రజల కోసం సృష్టించిన సంపద కాదా చంద్రబాబూ? రాష్ట్ర చరిత్రలో ప్రభుత్వ రంగంలో ఇన్ని పెట్టుబడులు ఎప్పుడైనా పెట్టారా? మా హయాంలో నిర్మాణాలు జరుపుకున్న కాలేజీలు, పోర్టులన్నీ కూడా ప్రత్యక్ష సాక్ష్యాలుగా ఇవాళ రాష్ట్ర ప్రజల కళ్ల ముందు లేవా? ఇవన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సృష్టించిన సంపద కాదా? ఈ ఆస్తులు విలువ భవిష్యత్తులో రూ.లక్షల కోట్లు కాదా? ఇదంతా అభివృద్ధి కాదా?

8 చంద్రబాబూ.. మీరు, మీ పార్టీ నాయకుల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధిగా.. మీరు, మీమనుషులు ఆస్తులు కూడబెడితే అది ప్రజల కోసం సృష్టించిన సంపదగా చెప్పుకుంటారు. మీ దృష్టిలో అభివృద్ధి, సంపద సృష్టి అంటే ఇదే. మీ పబ్లిసిటీ విన్యాసాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ప్రభుత్వ రంగంలో మంచి స్కూల్స్ లేకుండా చేసి, మంచి వైద్యాన్ని అందించే మెడికల్ కాలేజీలు లేకుండా చేసి, మంచి పోర్టులు లేకుండా చేసి, చివరకు ప్రజల ఆస్తులను వారికి కాకుండా చేసే దుర్మార్గపు చర్యలను ప్రజలు తప్పక నిలదీస్తారు. ఈ ప్రభుత్వాన్ని ఎండగడతారు.

జిల్లా వార్తలు

స్వయం ఉపాధి దిశగా..

- రైసెట్ శిక్షణలో యువతులు, మహిళలు
- ఉచిత శిక్షణతో పాటు వసతి కూడా..
- సద్వినియోగం చేసుకుంటున్న ఉమ్మడి జిల్లా యువత
- ఇప్పటివరకు 10,162 మందికి శిక్షణ



చింతకాని: నాగులవంచలో ఏర్పాటు చేసిన శిక్షణలో జూట్ బ్యాగులను తయారు చేసిన యువతులు, మహిళలు



శిక్షణలో మగ్గం వర్క్ నేర్చుకుంటున్న యువతులు, మహిళలు

చింతకాని: 'మారుతున్న సమాజానికి అనుగుణంగా మనమూ మారాలి.. అప్పుడే అభివృద్ధి సాధించగలుగుతాం.. కుటుంబానికి ఆసరాగా నిలబడగలం.. సమాజానికీ ఆదర్శంగా నిలుస్తాం' అంటున్నారు గ్రామీణ ప్రాంత యువత. బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్క్‌లో శిక్షణ పొందేందుకు యువతులు, మహిళలు ముందుకొస్తుండగా ఎస్‌బీఐ–ఆర్‌సెటి (గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ) వేదికగా నిలుస్తోంది. తద్వారా పలువురు శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్ తరాలకు బాటలు వేస్తున్నారు.

2006లో ప్రారంభం..

యువతులతో పాటు నిరుద్యోగ యువకులకు ఎస్‌బీఐ–ఆర్‌సెటి ఇస్తున్న శిక్షణ మేలైన ఫలితాలను ఇస్తోంది. ఖమ్మంలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న తరుణి హాట్ ప్రాంగణంలో 22 నవంబర్ 2006లో స్థాపించిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటి) ఇప్పటివరకు 355 శిక్షణ శిబిరాలను నిర్వహించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10,162 మందికి శిక్షణ ఇచ్చింది. వీరిలో సుమారు 8,130 మంది స్వయం ఉపాధి పొందారు. 2024–25 సంవత్సరానికి 970 మంది యువతకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 548 మందికి శిక్షణ ఇచ్చినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

యువతకు అందిస్తున్న శిక్షణలు..

ఎస్‌బీఐ–ఆర్‌సెటి ద్వారా యువతులతో పాటు నిరుద్యోగ యువకులకు టైలరింగ్, బ్యూటీషియన్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (మగ్గం వర్క్), జూట్ ప్రొడక్ట్, పుట్టగొడుగుల పెంపకం, పాడి పరిశ్రమ, సెల్ ఫోన్ రిపేరింగ్, టూవీలర్ మెకానిక్, కంప్యూటర్ అకౌంటింగ్, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, వర్మీ కంపోస్ట్ తయారీ, ప్లాంట్ నర్సరీ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, కారు డ్రైవింగ్ తదితర శిక్షణలు అందిస్తున్నారు.

శిక్షణలో సౌకర్యాలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10వ తరగతి ఉత్తీర్ణులైన, కాని యువతను శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంపిక చేస్తారు. అభ్యర్థులు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల వారై ఉండాలి. శిక్షణ పొందే వారికి సంస్థ ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం వారికి ధృవీకరణ పత్రాలను అందజేసి బ్యాంక్ నుంచి రుణాలు పొందేందుకు అవసరమైన సలహాలు ఇస్తారు.

ఉపాధి కల్పనే లక్ష్యం..



ఉపాధి కల్పనే లక్ష్యంగా మా సంస్థ ద్వారా యువతీ, యువకులకు శిక్షణ ఇస్తున్నాం. మా సంస్థలో అభ్యర్థుల ఇష్టం మేరకు కోర్సులు నేర్చుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల వారికి కూడా శిక్షణ ఇస్తున్నాం. ఇటువంటి శిక్షణ ప్రైవేటు సంస్థల్లో తీసుకుంటే రూ.20 నుంచి 30 వేలు అవుతాయి. వసతి, ఉచిత భోజనం అందిస్తున్నాం.

– సి.చంద్రశేఖర్, ఎస్‌బీఐ–ఆర్‌సెటి డైరెక్టర్, ఖమ్మం

ఉపాధి అవకాశం ఎక్కువ..



ప్రస్తుతం బ్యూటీషియన్, మగ్గం వర్క్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఎస్‌బీఐ–ఆర్‌సెటి నిర్వహిస్తున్న శిక్షణలో మహిళలు, యువతులు చాలా బాగా నేర్చుకుంటున్నారు. మా సంఘం ఆధ్వర్యంలో మండలంలో యువతులకు, మహిళలకు ఇప్పటివరకు టైలరింగ్, అగర్‌బత్తీలు, జూట్ బ్యాగుల తయారీ, మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇచ్చాం.

– డి.విజయలక్ష్మి, విజయభారతి మహిళా మండలి అధ్యక్షురాలు, చింతకాని

నమ్మకం పెరిగింది..



ఎస్‌బీఐ–ఆర్‌సెటి వారు చింతకానిలో ఏర్పాటు చేసిన మగ్గం వర్క్ (వస్త్ర చిత్రకళ ఉద్యామి) శిక్షణలో చేరాను. మగ్గం వర్క్ నేర్చుకోవడంతో భవిష్యత్‌లో స్వయం ఉపాధి పొందుతాననే నమ్మకం పెరిగింది. భోజనం, అల్పాహారం వంటి వసతులతో ఉచితంగా శిక్షణ అందించటం బాగుంది. నేర్చుకున్న మెళుకువలను తోటి వారికి నేర్పించి ఉపాధి రంగంలో రాణించేందుకు కృషి చేస్తా.

– ఆడెపు వినిత, మగ్గం వర్క్, చింతకాని

బాగా నేర్పిస్తున్నారు..



మగ్గం వర్క్‌పై తక్కువ సమయంలో సులువైన పద్ధతిలో శిక్షణ అందిస్తున్నారు. నేటి తరం యువతకు ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయి. చేతి వృత్తులకు మార్కెట్‌లో డిమాండ్ బాగా ఉంది. పోటీ ప్రపంచంలో స్వయం ఉపాధి ఎంతో అవసరం. ఎస్‌బీఐ–ఆర్‌సెటి ద్వారా పొందుతున్న శిక్షణతో స్వయం ఉపాధి పొందుతామనే నమ్మకం పెరుగుతుంది.

– కాలసాని పూజిత, మగ్గం వర్క్, చింతకాని

నృత్య పోటీల కోలాహలం



నృత్య ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు



తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు

పాల్వంచ: పట్టణంలోని కేటీపీఎస్ 'ఏ' కాలనీ సీతారామ కల్యాణ మండపంలో సంతోషిని నాట్యనిలయం వ్యవస్థాపకురాలు రమాదేవి రామ్ ఆధ్వర్యంలో ఆదివారం భద్రశైల జాతీయ నృత్య పోటీలు ఘనంగా జరిగాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచి విద్యార్థులు, వారి వెంట తల్లిదండ్రులు తరలివచ్చారు. దీంతో కల్యాణ మండప ప్రాంగణం కళకళలాడింది. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, గ్రూప్ విభాగాల్లో విద్యార్థుల శాస్త్రీయ, కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. పోటీల్లో 90 మంది విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. వైఎస్సార్ కడప, అనంతపురం, గుంటూరు, విశాఖపట్టణం, విజయవాడ, హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, సత్తుపల్లి, భద్రాచలంతో పాటు పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. పోటీలకు వచ్చిన విద్యార్థినులు, తల్లిదండ్రులకు నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించారు. జాతీయ స్థాయిలో ఈ పోటీలను ఇక్కడ నిర్వహించడం ఇదే ప్రథమం.

పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది



జాతీయ స్థాయి పోటీలకు హాజరు కావడం సంతోషంగా ఉంది. ప్రదర్శనలతో అనేక కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. వివిధ ప్రాంతాల వారితో పరిచయాలు పెరుగుతాయి. మనలో ఏమైనా లోటుపాట్లు ఉంటే తెలుసుకోవడంతో పాటు ప్రతిభను మరింతగా పెంచుకునే అవకాశం కలుగుతుంది.

– పి.భాగ్య, సీనియర్స్ విభాగం, హైదరాబాద్

ఏర్పాట్లు బాగున్నాయి



పోటీల నిర్వహణలో ఏర్పాట్లు బాగున్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచి విద్యార్థులు తరలి వచ్చారు. కళలను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్న వారికి ధన్యవాదాలు.

– డి.హారిక, జూనియర్స్ విభాగం, భద్రాచలం

విహారయాత్రకు తలసేమియా చిన్నారులు



చీరాల బీచ్‌లో ఉల్లాసంగా గడుపుతున్న చిన్నారులు, తల్లిదండ్రులు, సంస్థ బాధ్యులు

ఖమ్మంవైద్యవిభాగం : తలసేమియాతో బాధ పడుతున్న చిన్నారుల్లో మానసిక ఉల్లాసాన్ని నింపేందుకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులను విహారయాత్రకు తీసుకెళ్లారు. ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులు టీజీఎస్ ఆర్టీసీ బస్సు ద్వారా ఖమ్మం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చీరాల బీచ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ ప్రొద్దుటూరి అనిత మాట్లాడుతూ నిత్యం రక్తం ఎక్కించుకుంటూ, మందులు వాడుతున్న చిన్నారులను ఆ బాధ నుంచి కొంత ఉపశమనం కలిగించేందుకు తమ సంస్థ అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రతీ ఏడాది నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులను పర్యాటక ప్రాంతాలకు, విహార యాత్రకు తీసుకెళ్తామని తెలిపారు. పిల్లల కోరిక మేరకు ఈ ఏడాది సముద్రం చూపించేందుకు చీరాల బీచ్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. తమకు తలసేమియా వ్యాధి ఉందనే భావన నుంచి చిన్నారులను బయటకు తీసుకొచ్చేందుకు సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇలాంటి విహార యాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బీచ్‌లో సముద్ర అలల వద్ద చిన్నారుల ఆటలు చూస్తుంటే ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని, చిన్నారులను రక్షించుకోవడంతో పాటు వారిలో ఉల్లాసాన్ని నింపేందుకు సంస్థ ఇలాంటి కార్యక్రమాలను మున్ముందు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవిచందర్, బాధ్యులు పి.ఉదయ్‌భాస్కర్, ఎస్.ఉపేందర్, తలసేమియా బాధిత చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు

ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు



పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు సూచనలు చేస్తున్న దృశ్యం

వైరా: వైరాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించే ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోటీలను ప్రారంభించనున్నారు. ఆయా గురుకులాల నుంచి పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఇప్పటికే వైరాకు చేరుకున్నారు. 4వ జోన్‌లోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు సంబంధించిన 14 బాలికల గురుకులాల నుంచి 1,190 మంది విద్యార్థినులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొనున్నారు. విద్యార్థినుల సౌకర్యార్థం వసతి, భోజన ఏర్పాట్లను జోనల్ ఆఫీసర్ కొప్పుల స్వరూప రాణి ఆదివారం పర్యవేక్షించారు. ఆ తర్వాత ప్రిన్సిపాల్ డాక్టర్ సమత ఆధ్వర్యంలో గురుకులంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన సదుపాయాల కల్పనపై జోనల్ అధికారులు చర్చించారు. క్రీడల విజయవంతానికి ఏర్పాటు చేసిన కమిటీలకు పలు సూచనలు చేశారు. ఈ జోనల్ క్రీడలకు ఇన్‌చార్జ్‌గా కె. శ్రీలత వ్యవహరించనున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో డీసీఓ రాజ్యలక్ష్మి, మీసాల సునీత, జోనల్ సూపరింటిండెంట్ సంజీవరెడ్డి, రామ్ మోహన్‌రెడ్డి, టి.సాయికిరణ్, పాషా, రాజేశ్వరరావు, మారోజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.